ఆదివారం
10.09.2023


# ముందడుగు

హైదరాబాద్
సంపుటి: 1 సంచిక: 105 పేజీలు:4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
దినపత్రిక
SIMULTENEOUSLY PUBLISHED FROM HYDERABAD KARIMNAGAR WARANGAL JAGITYAL KHAMMAM, NANGONDA MAHABUBNAGAR, NIZAMABAD

## 21 నుండి రెండోదశ డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ

**ముందడుగు తెలంగాణ**

రాష్ట్ర రాజధాని హైదరాద్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల రెండో దశ పంపిణీ ఈ నెల 21న జరుగుతుందని.. ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అయితే ఈసారి 13,300 ఇళ్లను పేద ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. మొదటి దశలో ఇటీవల 11,700 ఇళ్లను విజయవంతంగా పేదలకు అందిచామని చెప్పారు. ఇక రెండో దశ ఏర్పాట్లపై శుక్రవారం రోజున సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో జరిగినటువంటి విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి కేటీఆర్ ఈ అంశంపై వివరించారు. అత్యంత పారదర్శకంగా అర్హులను గుర్తిస్తున్నామని తెలిపారు. అలాగే మీడియా ముందు కంప్యూటర్ల ద్వారా లాటరీ తీసి లబ్ధిజారులను ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. పైరవీకారులు, అనర్హులకు లబ్ధిదారుల్లో చోటు ఇవ్వడం లేదని అన్నారు. అలాగే ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధుల పాత్ర కూడా ఉండదని అన్నారు. అర్హులకే ఇళ్లు అందించాలని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే.. అత్యంత పకడ్బందీగా ఎంపిక విధానాన్ని రూపొందించామని పేర్కొన్నారు.



### బుల్లెట్‌ప్రూఫ్ రైలులో నియంత కిమ్ రష్యా పర్యటన..

ప్రపంచంలోనే నియంతలా అధిపతిగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ రష్యాకు వెళ్లేందుకు తన ప్రైవేట్ రైలును ఉపయోగించనున్నారు.


3 లో



### పశ్చిమ బెంగాల్‌లో గవర్నర్, సీఎం మధ్య వార్

పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి కార్యాలయం, గవర్నర్ మధ్య కొంతకాలంగా ఘర్షణ వాతావరణం కొనసాగుతుంది. రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తానని సీఎం మమతా బెనర్జీ ఇటీవల హెచ్చరించారు.

2 లో



### చంద్రబాబు అరెస్ట్ చేసిన సీఐడీ పోలీసులు

తెలుగుదేశం పార్టీ తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని శనివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు.

3 లో




# జీ20 సదస్సులో కీలక అంశాలపై చర్చ

## స్వాగతోపన్యాసం చేసిన ప్రధాని మోడీ

**ముందడుగు జాతీయం**

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జీ20 శిఖరాగ్ర సదస్సు కొనసాగుతోంది. జీ20లో సభ్య దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు ఈ భేటీకి హాజరయ్యారు. పలు కీలక అంశాలపై చర్చిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, ఫ్రాన్స్ ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయెల్ మక్రాన్, చైనా ప్రధాని లి కియాంగ్, దక్షిణాఫ్రికా అధినేత సిరిల్ రమాఫోసా.. ఇలా పలువురు ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో పాల్గొనడానికి శుక్రవారమే జో బైడెన్ భారత్‌కు వచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. జీఈ జెట్ ఇంజిన్లు, న్యూక్లియర్ టెక్నాలజీ వంటి అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. పరిశోధన రంగంలో భారత్‌లోని పలు ఐఐటీలతో అమెరికన్ యూనివర్శిటీలు కలిసి పని చేయడం వంటి అంశాలతో కూడిన ప్రతిపాదనలపై సంతకాలు చేశారు. ఐఐటీ కాన్పూర్, ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ బనారస్ హిందూ యూనివర్శిటీ, ఐఐటీ ఢిల్లీలతో అమెరికా బఫెలోలోని స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ న్యూయార్క్‌తో కలిసి పనిచేస్తాయి. ఐఐటీ కాన్పూర్, ఐఐటీ హైదరాబాద్, ఇతర సంస్థలు కూడా భారత్ యుఎస్ డిఫెన్స్ యాక్సిలరేషన్ ఎకోసిస్టమ్ కింద అకాడెమియా స్టార్టప్ పార్టనర్‌షిప్‌లో పాల్గొంటాయి. ఐఐటీ బాంబే.. చికాగో క్వాంటమ్ ఎక్స్ఛేంజ్‌లో అంతర్జాతీయ భాగస్వామిగా చేరింది. నేడు జీ20 సదస్సు వేదిక వద్ద అరుదైన దృశ్యం కనిపించింది. స్వాగతోపన్యాసం ప్రారంభం కావడానికి ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వేదిక వద్దకు వచ్చారు. అప్పటికే వేదిక వద్ద తనకు కేటాయించిన స్థానంలో కూర్చుని ఉన్న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా.. బైడెన్‌ను చూసి, లేచి వెళ్లి ఆయనను చిరునవ్వుతో పలకరించారు. బైడెన్ కూడా అంతే ఆప్యాయంగా హసీనాతో మాట్లాడారు. షేక్ హ్యాండ్ ఇచ్చారు. అనంతరం తన మొబైల్ ఫోన్‌తో షేక్ హసీనాతో కలిసి సెల్ఫీ దిగారు. కొద్దిసేపు నిల్చునే వారిద్దరూ మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను బంగ్లాదేశ్ హైకమిషనర్ కార్యాలయం విడుదల చేసింది.



బంగ్లాదేశ్ ప్రధానితో జో బైడెన్ సెల్ఫీ

### ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న భారత్ మండపం

2 లో





2 లో

## సెప్టెంబర్ 12 వరకు వర్షాలు

భారత వాతావరణ విభాగం వెల్లడి


# భూకంప ధాటికి వణికిన మొరాకో


## 820కి చేరిన మృతుల సంఖ్య, 329మందికి గాయాలు

**ముందడుగు అంతర్జాతీయం**

భూకంప ధాటికి ఆఫ్రికా దేశమైన మొరాకో వణికిపోయింది. భూకంప ప్రమాదం వల్ల మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 820కి చేరింది. మరో 329 మంది గాయపడ్డారని మొరాకో ప్రభుత్వం వెల్లడించింది. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే భారీ సంఖ్యలో భవనాలు ధ్వంసమయ్యాయి. చారిత్రక నేపథ్యం ఉన్న కట్టడాలు దెబ్బతిన్నాయి.

పర్యాటక ప్రాంతమైన మర్రాకేశ్‌కు నైరుతి దిశగా 71కిలోమీటర్లు దూరంలో శుక్రవారం రాత్రి ఈ భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై తీవ్రత 6.8గా నమోదైందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అల్ హౌజ్, మర్రాకేశ్, క్వార్జాజేట్, అజిలాల్ సహా పలు ప్రాంతాలు ఈ భూకంప ధాటికి వణికిపోయాయి. దాంతో పలు భవనాలు నేలమట్టం అయ్యాయి. 'అకస్మాత్తుగా భూమి






### రాష్ట్రపతి విందుకు ఆహ్వానం అందలేదు

స్పందించిన మల్లికార్జున ఖర్గే

2 లో

### నేటి విచిత్రం






# ఢిల్లీలోని మురికివాడలను దాచిపెడుతున్నారు

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు

**ముందడుగు జాతీయం**

భారత్ అధ్యక్షతన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు కోసం సుందరీకరణ పనుల్లో భాగంగా ఢిల్లీలోని మురికివాడలను కూల్చివేసి, అక్కడి ప్రజలను తరలించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. కేంద్రంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచ నేతల ముందు వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. జీ20 సదస్సు కోసం కొన్ని రోజులుగా ఢిల్లీలో విస్తృత ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే కోతులు, ఇతర జంతువులు వేదిక ప్రాంగణం వద్దకు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుందరీకరణ కోసం మురికివాడల్లోని ప్రజలను తొలగించి, అవి కనబడకుండా

# .. వణికిన మొరాకో

▶▶ మొదటిపేజీ తరువాయి

కంపించడంతో భవనాలు కదిలిపోయాయి. దాంతో ప్రజలు కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశారు. అప్పుడే సరిగ్గా విద్యుత్తు నిలిచిపోయింది. పది నిమిషాల పాటు మేం అంధకారంలో ఉండిపోయాం. ఏ నెట్‌వర్క్ పనిచేయలేదని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు వెల్లడించారు.
'భూమి కంపిస్తోన్న సమయంలో నేను నిద్రలో ఉన్నాను. నాకు గాల్లోకి ఎగిరిపోయినట్లు అనిపించింది. దాంతో వెంటనే ఇంట్లో నుంచి బయటకు పరిగెత్తాను. నది ఒక్కసారిగా కట్టలు తెంచుకొని ప్రవహించినట్లుగా అనిపించింది. మా ప్రాంతమంతా ఏడుపులు, కేకలతో నిండిపోయిందని మర్రాకేశ్ స్థానికులు వాపోయారు. దాంతో ప్రభావిత ప్రాంత ప్రజలంతా రాత్రి ఆరుబయటే ఉండిపోయారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారితో సమీప ఆసుపత్రులు కిక్కిరిసి పోయాయి. దేశం గతంలో ఎన్నడూ ఈస్థాయి భూకంపాన్ని చూడలేదని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రకంపనల ప్రభావం పొరుగున ఉన్న అల్జీరియాలో కనిపించింది. అయితే, అక్కడ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. 1980లో అల్జీరియాలో 7.3 తీవ్రతతో తీవ్ర భూకంపం సంభవించింది. ఆ దుర్ఘటనలో 2500 మంది మరణించగా.. 3 లక్షల మంది నిరాశ్రయులుగా మారారు. ఈ ఏడాది తుర్కియే ప్రకృతి ప్రకోపానికి గురైన సంగతి తెలిసిందే. దాంతో వేలల్లో మరణాలు సంభవించాయి.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..**

మొరాకోలో భూకంపంపై ప్రధాని మోదీ స్పందించారు. ఈ భూకంపం వల్ల వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో మొరాకో ప్రభుత్వంతో కలిసిపనిచేయడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. మొరాకోకు సమష్టిగా సాయం చేయాలని జీ20 ప్రారంభోపన్యాసంలో కూడా మోదీ పిలుపునిచ్చారు.

# తల్లిదండ్రులు కాసేపు ఫోన్లు లాకర్లో పెట్టండి



## సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ

**ముందడుగు హైదరాబాద్:**

పిల్లలు మంచి మార్గంలో నడవాలంటే ముందు తల్లిదండ్రులు కొన్ని అలవాట్లను మానుకొవాలని సిబిఐ మాజీ జెడీ లక్ష్మినారాయణ అన్నారు. ముందడుగుతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే ఇంట్లో ఉన్న తల్లి లేదా తండ్రి పిల్లలతో కాసేపు గడపండి. వారితో గడిపే సమయంలో మీ ఫోన్లను ఇంట్లోని లాకర్లో పెట్టండి. లేదా పిల్లల ముందు ప్రతిరోజు రెండు గంటలు కనబడకుండా పక్కన పెట్టండి. పిల్లలతో కనీస సమయం కేటాయించకపోతే వారు బయటివాళ్లతో గడిపేందుకు ఆసక్తి చూపుతారు. అప్పుడు చెడు మార్గంలో పయనించే అవకాశం ఉంటుంది. అందుకే ఎవరి పిల్లల భవిష్యత్తు వారి తల్లిదండ్రుల చేతిలో ఉంది. ఫోన్ అనేది కత్తిలాంటిది. దానిని మంచి కంటే చెడుకు ఎక్కువ వాడుతున్నారు. పనికిమాలినవి చూసి పిల్లలు వాటికి అడిక్ట్ అవుతారు. గేమ్స్ తో ప్రభావితమయ్యి ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. అందుకే వారితో నిత్యం సంభాషించాలి. కొంతమంది పిల్లలను అతి గారాబంగా పెంచుకుంటున్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వారు తట్టుకోలేరు. అందుకే వారికి కష్టం గురించి, డబ్బు గురించి, విలువల గురించి నేర్పండి. ఇతరులకు సహాయం చేసే విధానాన్ని అలవాటు చేయండి. విద్యార్థులకు ఏదైనా చెప్పడం కంటే ముందు తల్లిదండ్రులు పాటించాలి. మన ఇంట్లో మనతో ఉండే పిల్లలు తల్లిదండ్రులను గమనిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకుంటారు..

# ఢిల్లీలోని మురికివాడలను దాచిపెడుతున్నారు


▶▶ మొదటిపేజీ తరువాయి

గ్రీన్ షీట్లతో కవర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన కొన్ని దృశ్యాలు కాంగ్రెస్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో ఇవి కాస్తా వైరల్ అయ్యాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ మన పేద ప్రజలను, జంతువులను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతోంది. జీ20 సదస్సు కోసం మన దేశానికి విచ్చేసిన అతిథుల నుంచి వాస్తవాలను దాచిపెట్టాల్సిన అవసరం లేదని ఎక్స్ (ట్విటర్)లో రాసుకొచ్చారు. జీ20 సదస్సుకు విచ్చేసిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. శుక్రవారం రాత్రి భారత ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన భేటీలో 'ఢిల్లీలో మురికివాడల తొలగింపు' అంశం చర్చకు వచ్చిందా అని అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం ప్రతినిధిని ఒక విలేకరి అడిగారు. దీనికి ఆ ప్రతినిధి బదులిస్తూ.. ''అమెరికా, భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేయడమే మా ద్వైపాక్షిక సంబంధాల ముఖ్య ఉద్దేశం. దీని గురించే ఇరు దేశాధినేతలు చర్చించుకున్నారని తెలిపారు.

# ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న భారత్ మండపం

**ముందడుగు జాతీయం**

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు వేదికగా నిలిచిన భారత్ మండపం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. భారత్ మండపాన్ని ప్రధాని మోదీ 25జులై 2023న ప్రారంభించారు. భారత్ ఆతిథ్యమిచ్చే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు, ఎగ్జిబిషన్‌ల ఆధారంగా ప్రధాని సూచన మేరకు దీనిని నిర్మించారు. దేశీయ సంస్కృతి ఉట్టిపడేలా దీనిని డిజైన్ చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,700 కోట్లు వెచ్చించింది. ప్రగతి మైదాన్‌లోని 123 ఎకరాల్లో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ కమ్ కన్వెన్షన్ సెంటర్‌గా దీనిని నిర్మించారు. భారత్‌లో ఇది అతిపెద్ద ఎంఐసీఈ (మీటింగ్స్, ఇన్సెంటీవ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్) కేంద్రం. ఏకకాలంలో ఇక్కడ 5,500 వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు. శంఖు ఆకారంలో నిర్మించారు. దీని గోడలపై భారత చరిత్ర, సంప్రదాయానికి సంబంధించిన వివిధ అంశాలను చిత్రీకరించారు. వీటిల్లో ఆదివాసీ చిత్రకారులు గీసిన బొమ్మలు ఉన్నాయి. భారత్ మండపం మొత్తం 5జీ వైఫై నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. ఇది 10 జీబీ వేగంతో పనిచేస్తుంది. ఏకకాలంలో పలు సమావేశాలు ఏర్పాటు చేసేలా చాలా మీటింగ్ హాల్స్, లాంజ్‌లు, ఆడిటోరియంలు ఉన్నాయి. దీనిలోని యాంఫీ థియేటర్‌లో 3,000 మంది కూర్చోవచ్చు. భారత్ మండపంలో మెజెస్టిక్ మల్టీపర్పస్ హాల్, ప్లీనరీ హాల్ ఉన్నాయి. వీటిలో కలిపి 7,000 మంది కూర్చోవచ్చు.
భారత్ మండపంలోని దుబాసీల రూములో 16 భాషలను సపోర్ట్ చేసే అత్యాధునిక టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ ఏవీ సిస్టమ్, భారీ వీడియో వాల్స్ ఉన్నాయి. ఇక్కడ లైట్లు ఆక్యూపెన్సీ సెన్సర్ల ఆధారంగా పనిచేస్తాయి. సమీకృత నిఘా కేంద్రం కూడా ఇందులో ఉంది.



# రాష్ట్రపతి విందుకు ఆహ్వానం అందలేదు

## స్పందించిన మల్లికార్జున ఖర్గే

**ముందడుగు జాతీయం**

ఢిల్లీలో జరుగుతున్న జీ20 సదస్సును పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశాధినేతల కోసం శనివారం ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించకపోవడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.
ఈ అంశంపై ఆ పార్టీ నేతలు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విందుకు ఆహ్వానించకపోవడంపై మల్లికార్జున ఖర్గే స్పందించారు. జీ20 సదస్సుకు భారత్ ప్రాతినిధ్యం వహిస్తున్న వేళ మోడీ సర్కారు ఇలాంటి రాజకీయాలు చేయకుండా ఉండాల్సింది అని ఖర్గే విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిని ఆహ్వానించకపోవడంపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ స్పందిస్తూ.. ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇదిలా ఉండగా.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌లకు ఈ విందుకు హాజరవ్వనున్నారని స్థానిక మీడియా కథనాలు ప్రచురించింది. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా ఢిల్లీ బయలుదేరినట్లు సమాచారం.



# పశ్చిమ బెంగాల్‌లో గవర్నర్, సీఎం మధ్య వార్

**ఒకరిపై మరొకరు తీవ్ర హెచ్చరికలు**

**ముందడుగు జాతీయం**

పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి కార్యాలయం, గవర్నర్ మధ్య కొంతకాలంగా ఘర్షణ వాతావరణం కొనసాగుతుంది. రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తానని సీఎం మమతా బెనర్జీ ఇటీవల హెచ్చరించగా.. తాజాగా ఒక రాష్ట్ర మంత్రి కూడా గవర్నర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై గవర్నర్ కూడా స్పందిస్తూ.. ఏం చర్యలుంటాయో అర్ధరాత్రి వరకు నిరీక్షించి చూడండంటూ హెచ్చరించడం గమనార్హం.
రాష్ట్రంలో ఉన్నతవిద్యా వ్యవస్థను గవర్నర్ నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పశ్చిమబెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు తీవ్ర ఆరోపణలు చేశారు. యూనివర్సిటీల్లో తోలుబొమ్మ పాలన సాగుతోందన్న ఆయన.. ఉన్నత విద్యాశాఖతో సమావేశాలు నిర్వహించవద్దని రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ విలేకరులతో మాట్లాడుతూ స్ట్రోక్ కోసం ఈ రోజు అర్ధరాత్రి వరకు నిరీక్షించండి. చర్యలేం ఉంటాయో చూడండని ఘాటుగా స్పందించారు. దీనిపై వెంటనే స్పందించిన రాష్ట్రమంత్రి బసు.. నగరంలో కొత్త పిశాచి వచ్చింది. నగర పౌరులారా మీరే గమనించండి అంటూ ట్వీట్ చేశారు.
పశ్చిమబెంగాల్‌లో కొన్ని యూనివర్సిటీలకు కొత్త వైస్ ఛాన్సలర్‌లను గవర్నర్ నియమించడం తాజా వివాదానికి కారణమయ్యింది. ప్రభుత్వ ప్రతిపాదన లేకుండా వీసీలను నియమించడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటితోపాటు పలు బిల్లులకు అంగీకారం తెలపకుండా రాజ్‌భవన్‌లోనే పెండింగులో పెట్టడంపై ధ్వజమెత్తారు. గవర్నర్ మాత్రం తన అధికార పరిధిలోనే ఆ నియమకాలు చేశానని స్పష్టం చేశారు.







# సెప్టెంబర్ 12 వరకు వర్షాలు

## భారత వాతావరణ విభాగం వెల్లడి

**ముందడుగు జాతీయం**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సెప్టెంబర్ 12వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం తెలిపింది. శని, ఆదివారాల్లో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. రానున్న మూడు రోజుల్లో మాత్రం ఈశాన్య ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆ తర్వాత తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు.
తూర్పు భారతదేశంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాదు.. పశ్చిమబెంగాల్, బీహార్ లోనూ మోస్తారుగా వర్షాలు పడుతాయంటున్నారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. అటు వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడిందని వాతావరణ శాఖ వెల్లడించింది. వాయువ్య భారతదేశంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని, పలుచోట్ల చెదురుమదురు వర్షాలు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

# క్వీన్ ఎలిజబెత్2 గౌరవార్థం సువర్ణ నాణెం ఆవిష్కరణ

**నాణెం విలువ 191 కోట్లకుపైగానే**

**ముందడుగు అంతర్జాతీయం**

బ్రిటన్ రాణి ఎలిజబెత్2 మరణించి సెప్టెంబరు నాటికి ఏడాది పూర్తయింది. ఆమె వర్ధంతి సందర్భంగా లైఫ్ స్టైల్ బ్రాండ్ 'ఈస్ట్ ఇండియా కంపెనీ' క్వీన్ ఎలిజబెత్2 గౌరవార్థం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నాణేన్ని ఆవిష్కరించింది. రాణి మొదటి వర్ధంతి సందర్భంగా 'ఈస్ట్ ఇండియా కంపెనీ' ఆవిష్కరించిన ఈ నాణెం విలువ 23 మిలియన్ డాలర్లు. అంటే భారత్ కరెన్సీలో దీని విలువ రూ. 191 కోట్లకుపైగా ఉంటుంది. ఈ నాణెం తయారీలో నాలుగు కేజీల బంగారం, 6,400లకు పైగా వజ్రాలను ఉపయోగించారు. 9.6 అంగుళాల కంటే ఎక్కువ వ్యాసంతో ఈ నాణెం బాస్కెట్‌బాల్ పరిమాణంలో ఉంది. కామన్వెల్త్ దేశాలకు చెందిన ప్రముఖ హస్త కళాకారులు మేరీ గిల్లిక్, ఆర్నాల్డ్ మచిన్, రాఫెల్ మక్లౌఫ్, ఇయాన్ ర్యాంక్ సుమారు 16 నెలల పాటు శ్రమించి ఈ నాణేన్ని రూపొందించిన్నట్లు ఆ కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.
క్వీన్ ఎలిజిబెత్2 చిత్రాలు ఈ నాణెంపై ఉన్నాయి. మధ్యలో పెద్ద పరిమాణంలో కిరీటం గుర్తు ఉండే చిత్రం కనిపిస్తోంది. దాని వెనుభాగంలో రాణి చిత్రం ఉంది. చుట్టూ 10 చిన్న నాణేలను పొదిగారు. ఇప్పటి వరకు 1933 నాటి ''డబుల్ ఈగిల్''అత్యంత విలువైన నాణెంగా గిన్నిస్ రికార్డ్‌లో ఉంది. సోథెబైస్ న్యూయార్క్‌లో జరిగిన వేలంలో ఇది 18.9 మిలియన్ల డాలర్లు పలికింది. ప్రస్తుతం ఈ కొత్త కాయిన్‌ను విక్రయం గురించి ఎలాంటి వివరాలను కంపెనీ వెల్లడించలేదు. బ్రిటిష్ పాలకులు వర్తక వ్యాపారం కోసం నెలకొల్పిన ఈస్ట్ ఇండియా కంపెనీ 1874లో మూతపడిన విషయం తెలిసిందే. భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త సంజీవ్ మెహతా 2010లో దీనిని కొనుగోలు చేశారు.



# ఒకే ఏడాదిలో 777 సినిమాలు చూసిన వ్యక్తి

**గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్న స్వోప్**

**ముందడుగు అంతర్జాతీయం**

అమెరికాకు చెందిన 32 ఏళ్ల జాక్ స్వోప్ ఒకే ఏడాదిలో 777 సినిమాలు చూశాడు. ఎక్కువ సినిమాలు చూసి ఆ సినిమాలతోనే వరల్డ్ రికార్డు సృష్టించాలని నిర్ణయించుకున్నాడు. అందుకే ఒక వైపు తన ఉద్యోగం చేస్తూనే మరోవైపు థియేటర్‌లలో సినిమాలు చూడడం మొదలుపెట్టాడు. ఉదయం 6.45 నుంచి మధ్యాహ్నం 2.45 దాకా ఉద్యోగానికి వెళ్లేవాడు. ఆ తర్వాత కుదిరిన రోజుల్లో రోజుకు కనీసం 3 సినిమాలకు తగ్గకుండా చూశాడు. సెలవు రోజుల్లో వాటిని రెట్టింపు చేశాడు. మే 2022 నుంచి ఇలా చేయడం మొదలు పెట్టిన స్వోప్.. మే 2023 పూర్తయే సరికి ఏకంగా 777 సినిమాలు చూశాడు. మొదటగా 'మిలియన్స్: రైజ్ ఆఫ్ గ్రూ' అనే సినిమాతో ప్రారంభించి 'ఇండియానా జోన్స్ అండ్ డయల్ ఆఫ్ డెస్టినీ'తో పూర్తి చేశాడు. దీంతో ప్రపంచంలోనే ఏడాది కాలంలో అత్యధిక సినిమాలు చూసిన వ్యక్తిగా గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నాడు.
అయితే ఈ రికార్డును క్రియేట్ చేయడం కోసం స్వోప్ కొన్ని నియమాలు కూడా పాటించాడు. అవేంటంటే.. సినిమాలు చూసే సమయంలో మరొక పనిచేయకూడదు. అంటే ఫోన్ చూడడం, నిద్రపోవడం లాంటి పనులు చేయకూడదు. అలాగే తినడం, తాగడం లాంటివి కూడా చేయకూడదట. ఈ నిబంధనలన్నీ పాటించాడని నిర్ధారణ చేసుకున్న తర్వాతే గిన్నిస్ యాజమాన్యం జాక్ స్వోప్ పేరును రికార్డుల్లో నమోదు చేసింది. భవిష్యత్తులో ఏడాదికి 800 సినిమాలు చూసి నా రికార్డును నేనే తిరగరాయాలని భావిస్తున్నా' అని తెలిపాడు. ఇక ఈ రికార్డును సాధించినందుకు గాను అమెరికాలోని ఆత్మహత్య నివారణ సంస్థ జాక్ స్వోప్‌కు 7,777.77 డాలర్లను (రూ.6లక్షలు దాదాపుగా) బహుమతిగా ఇచ్చింది. ఇక గతంలో ఈ రికార్డు ఫ్రాన్స్‌కు చెందిన విన్సెంట్ క్రోన్ పేరు మీద ఉండేది.







# బుల్లెట్‌ప్రూఫ్ రైలులో నియంత కిమ్ రష్యా పర్యటన..

## అతని వెంట సెక్యూరిటీగా మరో మూడు రైళ్లు

**ముందడుగు అంతర్జాతీయం**



ప్రపంచంలోనే నియంతలా అధిపతిగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ ప్రసిద్ధి చెందాడు. ఇప్పుడు ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ రష్యాకు వెళ్లేందుకు తన ప్రైవేట్ రైలును ఉపయోగించనున్నారు. అతను తన తండ్రి నుండి ఈ రైలును వారసత్వంగా పొందాడు. కిమ్ జోంగ్ ఉన్ ప్రైవేట్ రైలులో ఫైవ్ స్టార్ హోటల్, ప్యాలెస్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. అంతే కాదు..ఈ రైలు సగటు వేగం గంటకు 37 మైళ్లు. కిమ్ జోంగ్ ప్రైవేట్ రైలు బుల్లెట్ ప్రూఫ్ కూడా. కిమ్ జోంగ్ ఉన్ ఈ రైలు భద్రత చాలా పటిష్టంగా ఉంటుందని సమాచారం.

దక్షిణ కొరియా మీడియా నివేదికల ప్రకారం, రైలుకు 100 మంది సెక్యూరిటీ గార్డులు కాపలాగా ఉంటారు. ఈ గార్డ్‌లు బాంబులు, ఇతర ప్రమాదకర, పేలుడు పదార్థాకలు గురికాకుండా ఉండేందుకు..ఎప్పటికప్పుడు ముందస్తుగానే వచ్చే స్టేషన్‌లను స్కాన్ చేసి, ఆపై రైలు ముందుకు సాగుతుంది. కిమ్ జోంగ్ ఉన్ రైలులో ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, అనేక బెడ్ రూములు, శాటిలైట్ ఫోన్లు, ఫ్లాట్ స్క్రీన్ టీవీలు కూడా ఉన్నాయి. రైలులోని ప్రతి కోచ్‌లో విశాలమైన బాత్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్, సర్వీస్ కోసం ఒక మహిళా సిబ్బంది కూడా ఉంటారని సమాచారం. కిమ్ జాంగ్ ఉన్ ప్రయాణిస్తున్నప్పుడు, అతనితో పాటు మరో మూడు రైళ్లు నడుస్తాయి. ఆ మూడు రైళ్లలో ఒకటి రైల్వే లైన్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ వెళ్తుంది. రెండవ రైలు భద్రతా సిబ్బందిని తీసుకువెళుతుంది. మూడవ రైలు ఇతర అధికారుల కోసం కేటాయించబడింది. 2002లో, రష్యా అధికారి ఒకరు కిమ్ జోంగ్‌తో కలిసి మాస్కోకు వెళ్లారు. కిమ్ జాంగ్ ప్రత్యేక రైలులోని సౌకర్యాల గురించి ఆ అధికారులు చెప్పగా విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ రష్యాలో పర్యటించి అధ్యక్షుడు పుతిన్‌తో ఆయుధాలపై చర్చిస్తారని సమాచారం.



# 72 అరుదైన జాతి పాములు స్మగ్లింగ్

## బెంగళూరు విమానాశ్రయంలో పట్టివేత

**ముందడుగు జాతీయం**

72 అరుదైన పాములు, ఆరు చనిపోయిన కోతులను తరలిస్తున్న ప్రయాణికుడిని కర్ణాటక రాజధాని బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. నిందితుడి బ్యాగేజీలో 72 అరుదైన పాములు, ఆరు చనిపోయిన కోతులను గుర్తించారు. కోతుల కళేబరాలను తగు జాగ్రత్తలతో డిస్పోజ్ చేశారు. పాములను వాటివాటి ఆవాస దేశాలకు పంపించారు. నిందితునిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఏషియా విమానంలో ఈ అరుదైన వన్య ప్రాణులను అక్రమంగా బెంగళూరుకు తీసుకొచ్చాడని కస్టమ్స్ అధికారులు చెప్పారు. అతడి బ్యాగేజీలో 72 అరుదైన పాములు ఉన్నాయని, వాటిలో 55 బాల్ పైథాన్‌లు, 17 కింగ్ కోబ్రాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఆరుదైన జాతికి చెందిన ఆరు కోతులు మాత్రం చనిపోయి ఉన్నాయన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

## రాచకొంత సీపీ డి ఎస్ చౌహాన్ సమన్వయ సమావేశం

**ముందడుగు హైదరాబాద్:**



ఈ నెల 18వ తేదీన ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో నెరెడ్‌మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపీ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ప్రణాళిక ప్రకారం జరిగేలా చూడాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని పోలీసు శాఖ కృషి చేస్తోంది అన్నారు. అందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు కూడా సహకరించాలని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ప్రజలు శాంతియుతంగా, ఘనంగా జరుపుకోవాలన్నారు. మండపాల్లో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని, ఆ నిబంధనలను మండపం నిర్వహకులు, కమిటీలు పాటించాలని సూచించారు. గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతవరణంలో వేడుకలు జరిగేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

గణేష్‌నవరాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరందరితో కలిసి సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర, ట్రాఫిక్ డిసిపి 1 అభిషేక్ మహంతి, ట్రాఫిక్ డీసీపీ 2 శ్రీనివాసులు, డిసిపి గిరిధర్ రావు, ఎల్బీనగర్ డిసిపి సాయి శ్రీ, డిసిపి ఎస్ బి, డిసిపి క్రైమ్స్ అరవింద్, డిసి ఉమెన్ సేఫ్టీ ఉషరాణి, మల్కాజ్గిరి అడిషనల్ డీసీపీలు, ఏసిపిలు, భగవంత రావు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి జనరల్ సెక్రటరీ, రావినూతల శశిధర్, వైస్ ప్రెసిడెంట్, రామరాజు విశ్వ హిందూ పరిషత్, నర్సింగ్ పురాయ వైస్ ప్రెసిడెంట్ భాగ్యనగర్ ఉత్సవ సమితి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్యాణ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పూలదండలు వద్దని మెడలో పాము వేసుకున్నాడు

## పుట్టిన రోజు సందర్భంగా ఒక ఎమ్మెల్యే తీరు

**ముందడుగు జాతీయం**

మా ఎమ్మెల్యే తన పుట్టిన రోజు అని అభిమానులు పూల దండలు వేస్తుంటే అయన వాటిని నిరాకరించారు. అక్కడే బుట్టలో ఉన్న ఒక పామును తీసుకుని తన మెడలో వేసుకున్నారు. ఇది చూసి ఆయన అభిమానులు షాక్ అయ్యారు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో ఈ సంఘటన జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే బాబు జండేల్ శుక్రవారం తన బర్త్ డేను విచిత్రంగా జరుపుకున్నారు. ఆయన అభిమానులు ఇచ్చిన పూల దండలను నిరాకరించారు. వాటిని తిరిగి వారికే ఇచ్చేశారు. అనంతరం పాములు ఆడించే వ్యక్తికి చెందిన బుట్టలో ఉన్న పామును తీసుకుని మెడలో వేసుకున్నారు. ఇది చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు.

తన పుట్టిన రోజును చాలా సింపుల్‌గా జరుపుకుంటానని కాంగ్రెస్ ఎమ్మెల్యే బాబు జండేల్ తెలిపారు. జంతువులు తన స్నేహితుల్లాంటివని చెప్పారు. తన పెరట్లో జాస్మిన్ చెట్టు ఉన్నదని, తరచుగా పాములు వస్తుంటాయని అన్నారు. తాను శివ భక్తుడినని అందుకే శివుడి ప్రతిరూపమైన పామును మెడలో వేసుకున్నట్లు మీడియాకు వెల్లడించారు.

# చంద్రబాబు అరెస్ట్ చేసిన సీఐడీ పోలీసులు

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసుపై అదుపులోకి.. ఆంధ్రప్రదేశ్ అంతటా తెదేపా ఆందోళనలు

**ముందడుగు ఆంధ్రప్రదేశ్**



తెలుగుదేశం పార్టీ తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని శనివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. తొలుత నంద్యాలలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్ వద్ద ఆయన బస చేసిన బస్సు వద్దకు పోలీసులు చేరుకున్నారు. ఆయనతో మాట్లాడి అదుపులోకి తీసుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి చంద్రబాబును అరెస్టు చేసినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయన కాన్వాయ్‌లోనే ఎన్‌ఎస్‌జీ భద్రతతో విజయవాడ తరలిస్తున్నట్లు తెలిపారు. అరెస్టుకు సంబంధించిన పత్రాలపై చంద్రబాబు సంతకం చేశారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో చంద్రబాబును హాజరుపరిచే అవకాశం ఉంది.

**చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదు**

చంద్రబాబు అరెస్టుపై ఆయన తరఫు న్యాయవాది స్పందించారు. ''చంద్రబాబుకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యపరీక్షల్లో చంద్రబాబుకు హైబీపీ, షుగర్ ఉంది. చంద్రబాబుకు హైకోర్టులో బెయిల్‌కు ప్రయత్నం చేస్తున్నాం. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. కేసుతో సంబంధం లేని సెక్షన్లు నమోదు చేశారు. స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో 37వ ముద్దాయిగా పేర్కొన్నారని తెలిపారు.

**రాత్రంతా హైడ్రామా**

అంతకుముందు చంద్రబాబు బస చేసిన ఆర్.కె. ఫంక్షన్ హాల్ వద్ద తీవ్ర ఉత్కంఠ నెలకొంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక చంద్రబాబు బస చేస్తున్న ప్రదేశానికి అధికసంఖ్యలో పోలీసులు చేరుకున్నారు. అనంతపురం నుంచి పోలీసు బృందాలను నంద్యాలకు రప్పించారు. మొత్తం ఆరు బస్సుల్లో బలగాలు ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నాయి. డీఐజీ రఘురామరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తెదేపా శ్రేణులు ఆర్.కె ఫంక్షన్ హాల్ వద్దకు భారీగా తరలివచ్చాయి. శనివారం ఉదయం 5 గంటల తర్వాత చంద్రబాబు బస చేస్తున్న వాహనం వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. వాహనం చుట్టూ ఉన్న తెదేపా నేతలను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కాలవ శ్రీనివాసులు, భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డి, ఎ.వి.సుబ్బారెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి తదితర స్థానిక తెదేపా నేతలు ఉన్నారు. బస చేసిన బస్సు నుంచి చంద్రబాబు కిందికి రావడంతో పోలీసులు ఆయనతో మాట్లాడి అదుపులోకి తీసుకున్నారు.





# హైదరాబాద్‌లో కార్పొరేట్ కార్యాలయం ప్రారంభించిన కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ

**హైదరాబాద్:**

2021 సంవత్సరంలో ప్రారంభమైన కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ ఇప్పుడు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాలలో అంతటా 65 అవుట్‌లెట్‌లను కలిగి ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ దక్షిణ భారత రాష్ట్రాల అంతటా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఎసిపి ప్రదీప్ కుమార్ రెడ్డి, స్వదేశ్ నెట్‌వర్క్స్ ఎల్‌ఎల్ పి ఇండియా వ్యవస్థాపకుడు పి. వెంకట రామి రెడ్డి, శ్రీనిధి ఎద్యుకేషనల్ గ్రూప్ చీఫ్ హెచ్‌ఆర్‌ఓ ఆశిష్ మిట్టల్ మరియు ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ2023 ఊర్మిళ చౌహాన్ ముఖ్య అతిథులుగా హాజరై సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ మెట్రో సమీపంలోని వాసవి ఎమ్‌పిఎమ్ గ్రాండ్‌లో తమ కార్పొరేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు గోలి గోపి మాట్లాడుతూ చిన్న బడ్జెట్‌లో అవకాశాలను కోరుకునే వారికి ఇది ఆదర్శవంతమైన వ్యాపారని, నిర్వహణ కోసం ఉచితంగా అందించబడిన మొదటి 25 రోజుల పదార్థాలతో పాటు ఎటువంటి రాయల్టీ ఛార్జీలు లేకుండా 3 లక్షలకు కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ ఫ్రాంచైజీని పొందవచ్చు అని తెలిపారు.

# బీహైవ్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**ముందడుగు హైదరాబాద్:**

రామంతాపూర్ లోని బీహైవ్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి.. పాఠశాలలోని చిన్నారులు శ్రీకృష్ణ, గోపీకల వేషధారణతో ఆకట్టుకున్నారు. చిన్నారుల అల్లరితో పాఠశాల ప్రాంగణమంతా సందడి, సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పాఠశాల బీహైవ్ పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ముందడుగు



# మెగాస్టార్ 156 లో రకుల్!

మెగాస్టార్ చిరంజీవికి హీరోయిన్లు సెట్ అవ్వడం ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే తమన్నా..కాజల్ అగర్వాల్..నయనతార లాంటి భామలు నటించడంతో మళ్లీ వాళ్లని రిపీట్ చేయలేని పరిస్థితి. కొత్త హీరోయిన్ తీసుకుంటే చిరంజీవికి వయసుకు మ్యాచ్ అవ్వడం కష్టం అవుతుంది. ఫాంలో ఉన్న ఏ భామని తీసుకురావలన్నా వయసు అడ్డంకిగా మారుతుంది. మరికొంత మంది హీరోయిన్లు ఆ యవసున్న హీరోలకు చెల్లెళ్లుగానూ నటించడంతో! వెంటనే వాళ్లని ఎంపకి చేయలేని పరిస్థితి.షారుఖ్ ట్రిపుల్ ధమాకా లేనట్లే ఈ నేపథ్యంలో 156..157 చిత్రాల్లో హీరోయిన్లగా ఎవరు ఎంపిక అవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. 157వ సినిమాకి సంబంధించి అనుష్క..నయనతారని పరిశీలిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే లోపు వాళ్లిద్దరిలో ఎవరో ఒకర్ని లాక్ చేసే అవకాశం ఉంది. మరి 156వ సినిమాలో హీరోయిన్ పరిస్థితి ఏంటి? అంటే తాజాగా ఈ విషయం వెలుగులోకి వస్తుంది. ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? అన్నది ఇంకా నిర్మాతలు ప్రకటించలేదు. స్వయంగా చిరంజీవి పెద్దకు మార్తె సుస్మిత ఈ చిత్రాన్ని నిర్మించడంతో ఆమె అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మెగాస్టార కి జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ ని రంగంలోకి దించే ఆలోచనలో రామ్ చరణ్ ఉన్నట్లు తెలిసింది. రకుల్ ఇప్పటికే తెలుగులో చాలా సినిమాలు చేసింది. వెల్ నోన్ పేస్. సీనియర్ భామలకు సరితూగే భామే. చరణ్ కి మంచి స్నేహితురాలు. గతంలో తని ఒరువన్ రీమేక్ లో నటించింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య స్నేహం కొనసాగుతుంది. ఇప్పుడా స్నేహంతోనే డాడ్ కి హీరోయిన్ గా రకుల్ ఒప్పిస్తున్నట్లు సమాచారం. చరణ్ మాటను ఆమె కాదనే అవకాశం లేదు. పైగా చిరంజీవితో ఛాన్ అంటే ఏ హీరోయిన్ కాదంటుంది. ప్రస్తుతం రకుల్ ప్రీత సింగ్ విశ్వనటుడు కమల్ హాసన్ సరసన 'ఇండియన్ 2' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అందులో ఓ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నా! రకుల్ పాత్రకి ఎ క్కువ ప్రాధాన్యత ఉంటుందని సమాచారం. ఆరకంగా తొలిసారి సీనియర్ హీరోతో రకుల్ తెరను పంచుకుంటుంది. తాజాగా చిరంజీవి సరసన షురూ చేసిందంటే? తిరుగుండదు. అటుపై నాగార్జున..బాలయ్య..వెంకటేష్ లాంటి హీరోలకు అమ్మడు ప్రమోట్ అవుతుంది. ఇప్పటికే ఓ తరం హీరోలందర్నీ అమ్మడు కవర్ చేసింది. ఆ అనుభవాన్ని రంగరించి సీనియర్లతో సై అనేస్తే సరి.



# నా భర్తకు మనోధైర్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరా

## చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి స్పందన

**ముందడుగు ఆంధ్రప్రదేశ్**

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుపై ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్పందించారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. నా భర్తను రక్షించాలని, ఆయనకు మనోధైర్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరా. చంద్రబాబు రాష్ట్ర ప్రజల బాగు కోసం పోరాటం చేస్తున్నారు. ఒక బిడ్డకు మనసు బాగాలేనప్పుడు తల్లిదండ్రుల వద్దకు వెళ్తారు. అందుకే నా బాధ చెప్పుకోవడానికే అమ్మవారి దగ్గరకు వచ్చా. చంద్రబాబు పోరాటం ప్రజల స్వేచ్ఛ కోసం. చేయి చేయి కలిపి ప్రజలంతా ఏకమవ్వాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. ఆమెతో పాటు కనకదుర్గమ్మను దర్శించుకున్న నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. అందరి ఆశీస్సులు మా కుటుంబానికి కావాలి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. రాత్రికి రాత్రే చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయం. చంద్రబాబు తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం శ్రమిస్తున్నారు. ఏపీని వదిలేసి ముఖ్యమంత్రి విదేశాల్లో తిరుగుతున్నాడు. అది మన దౌర్భాగ్యం. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలుపుదామని అన్నారు.

# ఆనంద్ దేవరకొండ

## 'గం గం గణేశా' ఫస్ట్ లుక్ రిలీజ్



ఇటీవల లవ్ ఎమోషనల్ ఎంటర్టైనర్ మూవీ బేబీ తో మంచి సక్సెస్ సొంతం చేసుకున్న యువ నటుడు ఆనంద్ దేవరకొండ తాజాగా నటిస్తున్న మూవీ గం గం గణేశా. కొత్త దర్శకుడు ఉదయ్ శెట్టి తెరకెక్కిస్తున్న మూవీ యొక్క ప్రమోషన్స్ ని తాజాగా మేకర్స్ స్టార్ట్ చేసారు. రెండు చేతుల్లో గన్స్ పట్టుకుని ఉన్న హీరో ఆనంద్ దేవరకొండ ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ కొద్ది సేపటి క్రితం విడుదల చేసారు. ఈ పోస్టర్ కి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీని హై లైఫ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్న గం గం గణేశా మూవీకి సంబంధించిన టీజర్, ట్రైలర్, రిలీజ్ డేట్ వంటి డీటెయిల్స్ అన్ని కూడా అతి త్వరలో వెల్లడి కానున్నాయి.



# 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' పై సమంత కామెంట్స్

నవీన్ పొలిశెట్టి, అనుష్క శెట్టి జంటగా నటించి తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ సినిమాకు ఆడియన్స్ తో పాటు సెలబ్రిటీల అప్రిసియేషన్ దక్కుతున్నాయి. ఈ సినిమా ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, స్టార్ డైరెక్టర్ మారుతి మెప్పు పొందిన విషయం తెల్సిందే. తాజాగా స్టార్ హీరోయిన్ సమంత 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా పై ప్రశంసలు కురిపించింది. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా చూశాక స్టార్ హీరోయిన్ సమంత ఇన్ స్టాగ్రామ్ ద్వారా స్పందిస్తూ... ఇటీవల కాలంలో ఏ సినిమా నన్ను ఇంతగా నవ్వించలేదు అన్నారు. సమంత ఇంకా స్పందిస్తూ... అనుష్క ఛార్మింగ్ గా కనిపించింది, నవీన్ పోలిశెట్టి సూపర్బ్ పర్ఫార్మెన్స్ చేశాడు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' టీమ్ అందరికీ కంగ్రాట్స్ అంది. రీసెంట్ గా రిలీజైన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుని సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ పాజిటివ్ టాక్ కు తగినట్లు మంచి వసూళ్లు దక్కించుకుంటోంది. యూఎస్ లో 550 కె డాలర్స్ మార్క్ చేరుకున్న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' వన్ మిలియన్ మైల్ స్టోన్ వైపు దూసుకెళుతోంది. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ కథతో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మాణంలో దర్శకుడు మహేష్ బాబు.పి తెరకెక్కించారు.



# శ్రీశైలం వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి

## స్వాగతం పలికిన ఆలయ ఈఓ లవన్న


**ముందడుగు శ్రీశైలం:**

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా శ్రీశైలం వచ్చారు. స్థానిక భ్రమరాంబ అతిథి గృహం వద్ద ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. శేషసాయి, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీ ఎన్. శ్రీనివాసరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న, జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య, ఆత్మకూరు ఆర్‌డిఓ ఎం. దాసు, ఆత్మకూరు సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ ఎ. శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. అదివారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దర్శించుకుంటారని ఆలయ అధికారులు తెలిపారు.

# ఇద్దరి మార్క్ 'భగవంత్ కేసరి'లో ఉంటుందట




నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా యువ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ భగవంత్ కేసరి. శ్రీలీల ఒక కీలక పాత్ర పోషిస్తున్న ఈ మాస్ యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్ లో బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్ పాల్ విలన్ గా నటిస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై హరీష్ పెద్ది, సాహు గారపాటి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ నుండి ఇటీవల రిలీజ్ అయిన ఫస్ట్ సాంగ్ గణేష్ ఆంథం అందరినీ అలరించి బాగా వ్యూస్ సొంతం చేసుకుంది. అయితే లేటెస్ట్ టాలీవుడ్ బజ్ ప్రకారం భగవంత్ కేసరి లో బాలయ్య మార్క్ పవర్ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తో పాటు అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్టైన్మెంట్ అంశాలు కూడా పుష్కలంగా ఉంటాయట. ఆ విధంగా బాలకృష్ణ ఫ్యాన్స్ తో పాటు అన్ని వర్గాల ఆడియన్స్ ని అలరించేలా దర్శకుడు అనిల్ రావిపూడి ఈమూవీని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కాగా ఈ మూవీని అన్ని కార్యక్రమాలు ముగించి అక్టోబర్ 19న గ్రాండ్ గా పలు భాషల ఆడియన్స్ ముందుకి తీసుకురానున్నారు.



# జవాన్' విలన్ మిస్టర్ డి సృష్టికి అతడే స్ఫూర్తి?

అట్లీ మరో బంపర్ హిట్ కొట్టాడు. షారూఖ్‌తో 'జవాన్' పాన్ ఇండియా హిట్ అని డిక్లేర్ అయింది. ఖాన్ కెరీర్ లోనే ఒక వివేకవంతమైన యాక్షన్ఎంటర్‌టైనర్ ఇది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ద్విపాత్రాభినయం.. అట్లీ దర్శకత్వ ప్రతిభను కొనియాడుతున్నారు. అట్లీకి ఇది తొలి హిందీ చిత్రం. కానీ తప్పటడుగులు పడలేదు. తాను ఆశించిన బ్లాక్ బస్టర్ ని అందుకున్నాడు. నిజానికి జవాన్ స్టోరి కొత్తదేమీ కాదు.. ద్విపాత్రలు త్రిపాత్రలు కూడా మనకు కొత్త కాదు. అట్లీ మార్క్ మాస్ యాక్షన్ అంశాలు షారూఖ్ అద్భుత నటన ఈ సినిమాని పెద్ద హిట్ చేశాయి అంటూ క్రిటిక్స్ విశ్లేషిస్తున్నారు. తాజాగా 'జవాన్' విలన్ మిస్టర్ డి పాత్ర రూపకల్పనకు బ్యాట్ మేన్ లోని ఒక పాత్ర స్ఫూర్తి అంటూ కొందరు విశ్లేషిస్తున్నారు. సౌత్ సూపర్‌స్టార్ విజయ్ సేతుపతి కాళీ గైక్వాడ్ పాత్ర పూర్తిగా భారతీయ విలన్ తరహా. అయితే ఈ సినిమాలోనే అసహ్యకరమైన మ్యాచిస్మో విలన్ మిస్టర్ డిని రూపొందించడంలో అట్లీకి ఒక హాలీవుడ్ సినిమా స్ఫూర్తి. క్రిస్టోఫర్ నోలన్ ది డార్క్ నైట్ రైజెస్ నుండి అతడు ప్రేరణ పొందాడని టాక్ వినిపిస్తోంది. Also Read ఎట్టకేలకు బయోపిక్‌లో నటిస్తున్న అమీర్ ఖాన్ విజయ్ సేతుపతి పోషించిన కాళీ గైక్వాడ్ జవాన్ లో ప్రధాన విలన్ కావచ్చు...కానీ మిస్టర్ డిని రష్యన్ మాఫియా సభ్యునిగా చేర్చిన అట్లీకి బ్యాట్ మేన్ లోని పాత్ర స్ఫూర్తిగా నిలిచింది. కథానుసారం మిస్టర్ డి.. కాళి రాజకీయ ఆకాంక్షలకు నిధులు సమకూర్చాలని నిర్ణయించుకుంటాడు. తద్వారా భారతదేశం ప్రపంచవ్యాప్తంగా నిషేధిత పరిశ్రమలకు బ్రీడింగ్ గ్రౌండ్ అవుతుంది. బెనెడిక్ట్ గారెట్ రచన ప్రకారం 'మిస్టర్ డి' పెంపుడు చిరుతతో కనిపిస్తాడు. క్రిస్టోఫర్ నోలన్ ది డార్క్ నైట్ రైజెస్ నుండి టామ్ హార్డీ బేన్‌ను జవాన్ మిస్టర్ డి పాత్ర చాలావరకూ గుర్తుకు తెస్తుంది. ఈ చిత్రం ప్రేక్షకులకు బానే అనే ప్రధాన DC విలన్‌ను పరిచయం చేసింది. నిజానికి మిస్టర్ డి ఎల్లప్పుడూ ముసుగు ధరించవలసి ఉంటుంది. రోలింగ్ స్టోన్‌తో ఒక ఇంటర్వ్యూలో బానే నొప్పిని అదుపులో ఉంచే మత్తుమందును ఆ మాస్క్ పంపిణీ చేస్తుందని నోలన్ చెప్పాడు. బానే మాదిరిగానే అట్లీ Mr D కూడా ఒక భారీ మాస్క్ ను ధరించాడు. అది అతడిని నియంత్రిత స్థితిలో ఉంచుతుంది. అతడి ఆహార్యం ప్రవర్తన కూడా అదే పాత్రను పోలి ఉంటుంది... హార్డీస్ బానే తరహా ప్రవర్తన ఇది అంటూ విశ్లేషిస్తున్నారు.